# మోసగించేందుకే.. ఆరు గ్యారెంటీలు



కైలాశ్‌నగర్‌లో నిర్వహించిన ఎన్నికల ప్రచార సభలో పాల్గొని మాట్లాడుతున్న మంత్రి తలసాని

- కాంగ్రెస్‌తో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి
- మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్

బేగంపేట్/ అమీర్‌పేట్, నవంబర్ 17 : ప్రజలను మోసగించేందుకు.. ఆరు గ్యారెంటీలతో వస్తున్న కాంగ్రెస్‌తో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. పక్క రాష్ట్రంలో కూడా ఇవే తరహా హామీలతో ఎన్నికల్లో గట్టెక్కిన వారికి.. ఇప్పుడు వాటిని అమల్లోకి తీసుకురావడంలో వారి చేతగాని తనం బయటపడిందని విమర్శించారు. హామీల అమలులో తమ వైఫల్యాలను స్వయంగా అక్కడి మంత్రులే అంగీకరిస్తున్నారన్నారు. శుక్రవారం సనత్‌నగర్ డివిజన్‌లోని కైలాశ్‌నగర్, సాయిబాబానగర్, సుభాష్‌నగర్, జైప్రకాశ్‌నగర్‌లలో మంత్రి తలసాని డివిజన్ కార్పొరేటర్ కొలను లక్ష్మిరెడ్డితో కలిసి ఇంటింటికీ ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా దశాబ్ద కాలంలో సనత్‌నగర్ ఎమ్మెల్యేగా మంత్రి హోదాలో చేపట్టిన అభివృద్ధి పనులకు స్థానికుల నుంచి ఊహించని స్పందన వస్తున్నదని తమ ఇళ్ల ముందుకు వస్తున్న తలసానికి మహిళలు అడుగడుగునా మంగళ హారతులతో స్వాగతం పలుకుతూ మెజార్టీతో గెలిపిస్తామంటూ భరోసా ఇస్తున్నట్లు తెలిపారు.

**కైలాశ్‌నగర్‌లో.. మల్టీపర్పస్ ఫంక్షన్ హాల్..**

బీఆర్‌ఎస్ ప్రభుత్వం కైలాశ్‌నగర్ కమ్యూనిటీ హాలు స్థలంలో బహుళ అంతస్థులతో మల్టీ పర్పస్ ఫంక్షన్ హాల్ నిర్మాణాలను చేపడుతున్నామని అన్నారు. దీంతో ఈ చుట్టుపక్కల ఉన్న వారికి చక్కటి కమ్యూనిటీ హాల్ అందుబాటులోకి రానుందన్నారు. దీంతో పాటు కైలాశ్‌నగర్‌లో తాను ఎమ్మెల్యేగా రాకముందు వరద ముంపు సమస్య ఎంతలా ఉండేది, ఇప్పుడు ఎంత వరకు పరిష్కారమైందనే విషయంలో ప్రజలు ఆలోచించాలన్నారు.



కైలాశ్‌నగర్‌లో ఎన్నికల ప్రచారానికి వచ్చిన మంత్రి తలసానికి హారతి ఇచ్చి స్వాగతం పలుకుతున్న మహిళ

**సౌభాగ్యనగర్‌లో ఆత్మీయ సభ ..**

సనత్‌నగర్‌లోని సౌభాగ్యనగర్, తులసీనగర్, రాజరాజేశ్వరినగర్ కాలనీ నివాసితులు తమ కాలనీల్లో చేపట్టిన అభివృద్ధి పనులకు కృతజ్ఞతగా సౌభాగ్యనగర్ చౌరస్తాలో మంత్రి తలసానికి ఆత్మీయ సభను ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి కాలనీల నుంచి మహిళలు పెద్దసంఖ్యలో విచ్చేశారు. తలసాని శ్రీనివాస్‌యాదవ్ నేతృత్వంలో తమ కాలనీలు విశేష రీతిలో అభివృద్ధి చెందాయని, అర్హులైన వారికి సంక్షేమ పథకాలను వర్తింపజేయడంలో కూడా మంత్రి తలసాని విశేష చొరవ చూపారన్నారు.

**దీర్ఘకాలిక సమస్యలు పరిష్కరించాం...**

తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాతనే సనత్‌నగర్ నియోజకవర్గం అభివృద్ధి జరిగిందని కోట్లాది రూపాయల నిధులతో దీర్ఘకాలిక సమస్యలను పరిష్కరించామని మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. శుక్రవారం రాంగోపాల్‌పేట్ డివిజన్ పరిధిలోని రంగ్రేజీ బజార్, ఓల్డ్ బోయిగూడ, కుర్మబస్తీ తదితర ప్రాంతాలలో ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. అంతకు ముందు సనత్‌నగర్ డివిజన్‌లోనూ ఆయన ఎన్నికల ప్రచారం చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ప్రజలను మోసగించేందుకు ఆరు గ్యారెంటీలతో వస్తున్న కాంగ్రెస్ పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. పక్క రాష్ట్రంలో కూడా ఇవే తరహా హామీలతో ఎన్నికల్లో గట్టెక్కిన వారికి ఇప్పుడు వాటి అమల్లోకి తీసుకురావడంలో వారి చేతగాని తనం బయటపడిందని విమర్శించారు. హామీల అమలులో తమ వైఫల్యాలను స్వయంగా అక్కడి మంత్రులే అంగీకరిస్తున్నారన్నారు. రాంగోపాల్‌పేట్ డివిజన్‌లో 2014కు ముందు తాగునీటి ఎంతో ఇబ్బంది ఉండేదని తాను ఎమ్మెల్యేగా గెలిచిన రెండేళ్లలోనే నూతన రిజర్వాయర్ నిర్మించి తాగునీటి ఎద్దడి సమస్యను పరిష్కరించిన విషయాన్ని గుర్తు చేశారు. అలాగే దర్గా వద్ద వర్షం కురిసిన ప్రతి సారి జనరల్ బజార్ దర్గా వద్ద చెరువును తలపించేలా వర్షం నీరు నిలిచి పోవడంతో స్థానికులు, వ్యాపారులు ఎంతో ఇబ్బందుల పడే వారని అలాంటిది, దర్గా వద్ద నూతన వంతెన నిర్మాణం చేపట్టి అక్కడి సమస్యను శాశ్వతంగా పరిష్కరించిన విషయాన్ని కూడా ఆయన స్థానికులకు గుర్తు చేశారు. తెలంగాణ ప్రభుత్వం ఏర్పడిన తరువాతనే దీర్ఘకాలికంగా ఉన్న సమస్యలను సీఎం కేసీఆర్ దృష్టికి తీసుకువెళ్లడం ద్వారా ఈ సమస్యలను పరిష్కరించడం జరిగిందన్నారు. కాంగ్రెస్ నాయకులకు అధికారం తప్ప ప్రజలకు మేలు చేసే కార్యక్రమాలను చేపట్టాలన్న ఆలోచనే లేదన్నారు. వీటితో పాటు డ్రైనేజీ, మంచినీటి వ్యవస్థ, చక్కటి సీసీ రోడ్ల నిర్మాణాల ఏర్పాటు, కమ్యూనిటీ హాలు అభివృద్ధి వంటి అనేక అభివృద్ధి చేపట్టిన విషయాన్ని ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో రాంగోపాల్‌పేట్ డివిజన్ మాజీ కార్పొరేటర్ అరుణగౌడ్, నాయకులు శ్రీనివాస్‌గౌడ్, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.





రాంగోపాల్‌పేట్ డివిజన్‌లోని జనరల్ బజార్‌లో నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న మంత్రి తలసాని.. అడుగడుగునా నీరాజనాలు పడుతున్న స్థానికులు

## టెక్ మహీంద్రాలో ఉచిత కంప్యూటర్ శిక్షణ

బన్సీలాల్‌పేట్, నవంబర్ 17 : టెక్ మహీంద్రా ఫౌండేషన్ స్మార్ట్ కేంద్రం ద్వారా నిరుద్యోగుల కోసం ఉచితంగా నైపుణ్య శిక్షణ అందిస్తున్నామని కేంద్రం మేనేజర్ షేక్ మౌలా అన్నారు. ఈ మేరకు శుక్రవారం న్యూబోయిగూడలో ఇంటింటికీ ప్రచారం నిర్వహించారు. పదవ తరగతి పాసై, ఇంటర్, డిగ్రీ పాస్ లేదా ఫెయిల్ అయిన 19 నుంచి 27 ఏండ్ల వయస్సు ఉన్న యువతీ యువకులకు మూడు నెలల పాటు కంప్యూటర్, స్పోకెన్ ఇంగ్లిష్, టైపింగ్, ఇంటర్నెట్, రిటైల్ రంగాలలో ఉచిత శిక్షణ అందించి, ఉద్యోగ అవకాశాలను కల్పిస్తున్నామని ఆయన తెలిపారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు ఫోన్ నంబర్ 91549 90135 లో సంప్రదించాలని ఆయన కోరారు. గాంధీ దవాఖాన ఎదురుగా యాక్సిస్ బ్యాంక్ సమీపంలో ఎవర్‌గ్రీన్ కమ్యూనిటీ హాల్‌లో తమ శిక్షణా కేంద్రానికి నేరుగా వచ్చి కూడా దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు.



బోయిగూడలో ప్రచారం నిర్వహిస్తున్న సిబ్బంది

## అభివృద్ధికి నిధులివ్వకుండా కేంద్రం వివక్ష




శ్రీరామ్‌నగర్‌లో జరిగిన ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొని మాట్లాడుతున్న మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్

అమీర్‌పేట్, నవంబర్ 17 : తెలంగాణ రాష్ట్రం నుంచి అత్యధికంగా ఆదాయం అందుతున్నా.. నిధులిచ్చి రాష్ట్రాభివృద్ధికి సహకరించడంలో కేంద్రం వివక్ష చూపుతోందని మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. ఇక్కడి నుంచి పార్లమెంట్‌కు ప్రాతినిధ్యం వహిస్తూ కేంద్ర మంత్రిగా కొనసాగుతున్న జి.కిషన్‌రెడ్డి గత నాలుగున్నరేండ్ల కాలంలో తనను గెలిపించిన సికింద్రాబాద్ పార్లమెంట్ పరిధిలోని ప్రజలకు ఏం చేశారో చెప్పగలరా అంటూ ప్రశ్నించారు. కొత్త రాష్ట్రాన్ని తనవైన ప్రణాళికలతో అన్నిరంగాల్లో అభివృద్ధి చేస్తూ దేశంలోనే అగ్రగామి రాష్ట్రంగా నిలిపిన సీఎం కేసీఆర్ పాలనే తెలంగాణకు శ్రీరామ రక్ష అన్నారు. శుక్రవారం రాత్రి అమీర్‌పేట్ డివిజన్‌లోని శ్రీరామ్‌నగర్ కాలనీ నివాసితులు ఏర్పాటు చేసిన ఆత్మీయ సమ్మేళనానికి మంత్రి తలసాని హాజరయ్యారు. ఈ సందర్భంగా కాలనీ నివాసితులు మాట్లాడుతూ.. తమ సమస్యలు తెలుసుకుని పరిష్కరించిన తలసాని శ్రీనివాస్‌యాదవ్ అభ్యర్థిత్వాన్ని బలపరుస్తామని పేర్కొన్నారు. తన అభ్యర్థిత్వాన్ని బలపరుస్తున్న కాలనీ వాసులకు మంత్రి కృతజ్ఞతలు తెలిపారు. తెలంగాణ వచ్చిన తరువాత సనత్‌నగర్ నియోజకవర్గం అభివృద్ధికి సీఎం కేసీఆర్, పురపాలక మంత్రి కేటీఆర్ అవసరమైనన్ని నిధులిచ్చి సహకరించిన తీరు అమోఘమన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ ఎన్. శేషుకుమారి, కాలనీ ప్రతినిధులు చెన్నయ్య, వైష్ణవి, ఎస్‌ఆర్‌నగర్ రాయల సేవా సమితి అధ్యక్షుడు ఆర్.సి. కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ లక్ష్మీనారాయణ స్వామి ఆలయంలో అన్నకోటి



స్వామివారి ముందు ఉంచిన అన్న ప్రసాదాలు

బేగంపేట్ నవంబర్ 17: సికింద్రాబాద్ జనరల్ బజార్‌లోని శ్రీ లక్ష్మీనారాయణ స్వామి దేవాలయంలో శుక్రవారం అన్నకోటి కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రతి ఏడు కార్తీకమాసంలో వచ్చే శుద్ధ పంచమి నాడు ఆలయంలో అనాదిగ వస్తున్న ఆచారం అన్నకోటి. ఈ సందర్భంగా వంటశాలలో తయారైన మొత్తం ప్రసాదాలను స్వామివారి ముందు నైవేద్యంగా పెట్టి పూజా కార్యక్రమాలు నిర్వహించి ఆయా నైవేద్యాలను కలిపి భక్తులకు సహపంక్తిలో పంపిణీ చేశారు. ఈ ఉత్సవంలో భాగంగా భక్తులకు పులిహోర, లడ్డు, బూంది, దద్దోజనం, క్షీరాన్నం, కదంబం తదితర నైవేద్యాలను స్వామివారికి సమర్పించిన అనంతరం భక్తులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో అనువంశిక ధర్మకర్తలు గుమిడెల్లి శ్రీనివాస్, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

## లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో దుప్పట్లు అందజేత



రోగులకు దుప్పట్లు అందజేస్తున్న లయన్స్ క్లబ్ ప్రతినిధులు

బన్సీలాల్‌పేట్, నవంబర్ 17 : లయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ (320బీ) డిస్ట్రిక్ట్ గవర్నర్ రేసు మల్లారెడ్డి, మాజీ గవర్నర్ డాక్టర్ జీఆర్ లింగమూర్తి ఆధ్వర్యంలో గాంధీ దవాఖానలో చికిత్స పొందుతున్న 500 మంది పేద రోగులకు దుప్పట్లను పంపిణీ చేశారు. చలికాలం ప్రారంభం కావడంతో నిరుపేద రోగులకు చలి నుంచి రక్షణ కల్పించేందుకు తాము దుప్పట్లను అందజేశామని వారు తెలిపారు. లయన్స్ క్లబ్ ప్రతినిధులు సాయిరామ్ రాజు, హర్భిందర్ సింగ్, అరుణ్, శ్రీనివాస్ పాల్గొన్నారు.